## క్లుప్తంగా

### ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలి పర్యటన



**పర్వతగిరి :** మండలంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సోమవారం పర్యటించారు. మండలంలోని దేవీలాల్‌తండాకు చెందిన గుగులోతు మాగ్య గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ పరామర్శించారు. అనంతరం చౌటపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగంపల్లి కుమార్‌రావు తల్లి నీలమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. తదనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జిల్లా రాములు, సముద్రాల బుచ్చమ్మ, మట్ట కుమారస్వామి కుటుంబాలను పరామర్శించారు. అలాగే కల్లెడలో బల్లెల ముత్తయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భానోత్ భాస్కర్, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

**వర్ధన్నపేట మండలంలో..**

**రాయపర్తి (వర్ధన్నపేట) :** వర్ధన్నపేట మండల కేంద్రంతోపాటు ల్యాబర్తి, తదితర గ్రామాల్లో మృతుల కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కమ్మగాని ప్రభాకర్‌గౌడ్, పోశాల వెంకన్న, సాయికుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు అభినందన



**ఖానాపురం :** అమెరికా, కెనడా పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యర్ర జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. తొలుత ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు ముస్తఫా, సాగర్‌రావు, లాల్‌సాహెబ్, వెంకన్న, లింగయ్య, నర్సయ్య, తదితరులున్నారు.

### రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



ఎల్లమ్మ (ఫైల్)

**కాశిబుగ్గ :** పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన వరంగల్, చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ధర్మారం రైల్వే గేటు సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. గీసుకొండ మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గట్టికొప్పుల ఎల్లమ్మ(73) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమారుల వద్ద ధర్మారంలో నివాసం ఉంటుంది. సోమవారం పెద్ద కుమారుడు రమేశ్ వద్దకు బయల్దేరింది. ఈ క్రమంలో ధర్మారం రైల్వే గేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా డౌన్‌లైన్‌లో వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి మృతురాలి పెద్ద కుమారుడు రమేశ్‌కు అప్పగించినట్టు సీఐ తెలిపారు.

### ఆర్థికసాయం



**నర్సంపేట :** పట్టణంలోని కమలాపురం ప్రాంతానికి చెందిన పైసా సరోజన ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీజేపీ జిల్లా నాయకుడు, నర్సంపేట చేరికల కమిటీ చైర్మన్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ జుర్రు రాజు సోమవారం రూ.3 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సోమన్న, పద్మ, సలేంద్ర రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

### నేటి నుంచి మూగజీవాలకు టీకాలు

**ఆత్మకూరు :** మండలంలోని మూగజీవాలకు మంగళవారం నుంచి ముద్దచర్మవ్యాధి (లంపి స్కిన్ డిసీజ్) నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి ధర్మానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, దుక్కిటెడ్లు, 3 నెలలకు పైబడిన ఆవు దూడలకు టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# బ్యాంకులు రైతులకు రుణాలు అందించాలి

**నర్సంపేట రూరల్ :** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు బ్యాంకులు పంట రుణాలు అందించాలని ఏఐకేఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు కేశెట్టి సదానందం, ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సాయికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సదానందం, రాజమౌళి మాట్లాడారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు పెట్టుబడులకు అవసరమైన మేరకు రుణాలివ్వకపోతుండడంతో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనుమాల రమేశ్, జన్ను రమేశ్, గుర్రం రవి, అచ్చానాయక్, కందికొండ నర్సింహస్వామి, మర్రి శ్రీనివాస్, కలకోట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**సంగెం :** తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు ఏఐకేఎఫ్ మండల కోకన్వీనర్లు గోనె రాంచందర్, సోమిడి రవి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్క అశోక్, మండల అయిలయ్య, సాంబయ్య, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**దుగ్గొండి :** ఏఐకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగెల్లి కొంరయ్య, సింగతి మల్లికార్జున్, ఎలబోయిన రాజు, పేరబోయిన ఐలోని, బుడిమె సురేందర్, చేరాలు, మేరుగు సుధాకర్ పాల్గొన్నారు.

**నల్లబెల్లి :** ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా నాయకుడు దామ సాంబయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగెల్లి యోజోబు, రాజయ్య, శ్రీకాంత్, సాంబయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**చెన్నారావుపేట :** ఏఐకేఎఫ్, ఎంసీపీఐ (యూ) మండల కార్యదర్శి జన్ను రమేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొర్రి శ్రీను, సాంబయ్య, అచ్చానాయక్, గోరేమియా పాల్గొన్నారు.

# కృష్ణమూర్తికి ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు



నర్సంపేట రూరల్ : అవార్డు అందుకుంటున్న డాక్టర్ కారంపూడి కృష్ణమూర్తి

**నర్సంపేట రూరల్:** నర్సంపేట మండలం కమ్మపల్లికి చెందిన వాస్తు జ్యోతిష పండితుడు డాక్టర్ కారంపూడి కృష్ణమూర్తికి ఇంటర్నేషనల్ వేదిక ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో.. ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఆయన ఢిల్లీలో ఈ అవార్డును అందుకున్నారు. కృష్ణమూర్తి పలువురు అభినందనలు తెలిపారు.

**ప్రభుత్వ ఉపాధ్యాయుడికి..**

**నెక్కొండ :** మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బూర్గుపల్లి శ్రావణ్‌కుమార్‌కు నిర్వాహకులు ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. వేద జ్యోతిషంలో పరిశీలనకు దక్కిన గుర్తింపుగా అవార్డు అందుకోవడం సంతోషాన్ని ఇచ్చిందని శ్రావణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. అవార్డు తనపై బాధ్యత మరింత పెంచిందన్నారు. 2050 నాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి దీటుగా వేద జ్యోతిష్యం ప్రత్యేకతను చాటుకుంటుదని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రావణ్‌కుమార్‌ను కన్జ్యూమర్ కన్ఫర్మేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగిలిచర్ల సదుర్శన్ తదితరులు అభినందించారు.



నెక్కొండ : అవార్డుతో శ్రావణ్‌కుమార్

### సంతలో విద్యుత్ లైట్ల ఏర్పాటు

సాక్షి స్పందన

**పర్వతగిరి :** 'పర్వతగిరి సంత.. జనానికి చింత' శీర్షికతో ఈనెల 15న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని సంతలో సోమవారం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. అలాగే రోడ్లపై ఉన్న దుకాణ సముదాయాలను తొలగించారు. కాగా సంతలో తాగునీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది. ఈ విషయమై అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రధాన రహదారి తవ్వారు.. వదిలేశారు

**దుగ్గొండి :** మండలంలోని గిర్నిబావిలో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిని మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ నేపథ్యంలో అధికారులు సుమారు రెండు నెలల క్రితం తవ్వి పైపులైన్‌ను సరిచేశాక మట్టి పూడ్చి అలాగే వదిలేశారు. దీంతో ప్రధాన రహదారికి మధ్యలో గొయ్యి ఏర్పడి ప్రతీరోజు వాహనాలు ప్రమాదాల బారిన పడుతుండడం కనపడుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గుంత స్థానంలో సీసీ వేసి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

**చెన్నారావుపేట :** ప్రజలకు మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్ తెలిపారు. మండలంలోని చెరువుకొమ్ము తండా గ్రామ శివారులోని బోడతండాలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సైడ్ డ్రైనేజీ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం సైడ్ డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోడ బద్దు నాయక్, డాక్టర్ హరిశంకర్, మురళీనాయక్, హరిసింగ్, మోహన్, వెంకన్న, సుమన్ ఉన్నారు.

### అక్రమ నిర్మాణాన్ని తొలగించండి

**నర్సంపేట :** పట్టణంలోని మాధన్నపేట దారిలో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను తొలగించడంతోపాటు బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు కలెక్టర్‌కు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు కలెక్టర్‌కు సమస్యను వివరించారు. తుమ్మ ఏకాంబ్రం రోడ్డును ఆక్రమించి మెట్లు, కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నాడని, ప్రశ్నిస్తే మున్సిపల్ పర్మిషన్ ఉందంటూ దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. అక్రమంగా నిర్మించిన మెట్లు, కాంపౌండ్ వాల్‌ను తొలగించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పాదిల రాంచందర్, కొల్లూరి రాజు, సావిత్రి, సాంబరాజు రాజు, వసంత, భాగ్యమ్మ, శ్యామ్, రజిత, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, నర్సయ్య, కిరణ్, సత్యం, మల్లికార్జున్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నివాళి

**గీసుకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు తల్లి ఎల్లమ్మ మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ నాయకులు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంబాబును, అతడి సోదరుడు రమేశ్‌ను ధర్మారావు, ఇతర నాయకులు పరామర్శించారు. ఎల్లమ్మ మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనల ఉల్లంఘన



మాట్లాడుతున్న తేజావత్ వాసునాయక్

**నర్సంపేట :** పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, టై, బెల్టు, షూ, తదితరాలను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారని తెలిపారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చదవాలంటే ఫీజులు చెల్లించలేని దుస్థితిలో వేదనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ జీఓల మేరకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉన్నా అమలు కావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. నియోజకవర్గంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు అనుకూలంగా ఫీజులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కూలీనాయక్, వాల్యా, రాజు, వీరన్న, రాంధన్, భాస్కర్, లాలూ, రామచంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# కోళ్లఫారం నిర్మాణాన్ని నిలిపేయాలి

**రాయపర్తి :** మండలంలోని మొరిపిరాల శివారులోని పన్యానాయక్‌తండాలో చేపట్టిన కోళ్లఫారం నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ భూక్య వెంకట్రామ్, ఎంపీటీసీ భూక్య క్రాంతి ఆధ్వర్యంలో గ్రామస్తులు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ వెంకట్రామ్, ఎంపీటీసీ క్రాంతి కోళ్లఫారం ఏర్పాటుతో ఎదురవనున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కోళ్లఫారం నిర్మాణాన్ని నిలిపేసేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య రాజారాం, నాయకులు దేశీరాం, మూనావత్ కిషన్, లక్పతి, శంకర్, వేణుగోపాల్, బుచ్చన్న, బాలాజీ, జవహర్‌లాల్, రమేశ్, సుగుణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

### మండలస్థాయి పోటీలకు హాజరుకావాలి

**దామెర :** క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం మంగళవారం మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రమాదేవి, మండల నోడల్ అధికారి జుమ్మా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని హకీంపేట్, హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో గల క్రీడా పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశం పొందే అవకాశం ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి, 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంపికకు హాజరుకావాలని వెల్లడించారు. 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్యలో జన్మించినవారు అర్హులని సూచించారు. హాజరయ్యే విద్యార్థులు ఆధార్ వర్జినల్, బోనోఫైడ్, డేటాఫ్ బర్త్, క్లాస్3 ప్రొగ్రెస్ రిపోర్ట్‌తో ఎంపికలకు హాజరుకావాలని తెలిపారు.

# మాఫియా చేతిలో విద్యారంగం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు

**ఖిలా వరంగల్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాలనలో విద్యారంగం పూర్తి మాఫియా చేతిలోకి వెళ్లిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండీ.అక్బర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనలో పడిపోయారని అన్నారు. నీట్ పరీక్షను తక్షణమే రద్దుచేసి రాష్ట్రాల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరిగిన ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఈక్రమంలో ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, రవీందర్, రమేష్, గన్నారపు రమేష్, ఎలేందర్, బద్రి, చంద్రకళ, శంకరయ్య, కేశవులు, శరత్, రవి, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్య భద్రతే ధ్యేయం

**మామునూరు :** స్పెషల్ పోలీసులకు మానసిక ఒత్తిడిని దూరం చేసి, ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించడమే పోలీస్‌శాఖ లక్ష్యమని కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులోని టీఎస్ ఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్‌లోని యూనిట్ ఆస్పత్రి ప్రాంగణంలో బేగంపేట్ మెడీ కవర్, వాసన్ ఐకేర్ వరంగల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కె.సాకేత్, సుమన్ బానిక్, శశిధర్, ప్రకాశ్, గోవింద్‌కుమార్, అన్వేషినితో కలిసి వైద్య శిబిరాన్ని కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో శ్వేత, శివ, ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, ఫార్మసిస్ట్ జలగం రమేష్‌కుమార్, సురేష్, రంజిత్‌కుమార్, నవీన్, మనోహర్‌రావు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ బాలల ఉన్నతే లక్ష్యం



నర్సంపేట రూరల్ : పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సీడీపీఓ

**నర్సంపేట రూరల్ :** అంగన్‌వాడీ బాలల ఉన్నతే లక్ష్యంగా అంగన్‌వాడీ టీచర్లకు ఈసీసీఈ శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీడీపీఓ విద్య తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం –2020లో భాగంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన రెండో బ్యాచ్ శిక్షణను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ టీచర్లు పూర్తిస్థాయిలో పాటించాలని చెప్పారు. తద్వారానే మెరుగైన ఫలితాలు రాగలవని తెలిపారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో జాతీయ విద్యావిధానం అమల్లోకి వస్తోందన్నారు. అంగన్‌వాడీల్లో బాలల సమగ్రాభివృద్ధి, ఉన్నతి దిశగా క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. సెంటర్ల నిర్వహణలో సమర్థత చాటాలని చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు విధినిర్వహణలో భాగంగా సెంటర్లను సందర్శిస్తారని తెలిపారు. తొలుత పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రెయినీ రమాదేవి, మంజుల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్కూళ్లలో సదుపాయాలు కల్పించాలి

- కార్పొరేటర్ మనీషా శివకుమార్

**గీసుకొండ :** ప్రభుత్వ స్కూళ్లకు అవసరమైన మేరకు నిధులు మంజూరు చేసి సదుపాయాలు కల్పించాలని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ కార్పొరేటర్ మనీషా శివకుమార్ డిమాండ్ చేశారు. ఆ డివిజన్ పరిధిలోని జాన్‌పాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో వసతులు, ఇతరత్రా అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యారంగ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిధులు మంజూరు చేసి స్కూళ్లలో నెలకొన్న అన్ని సమస్యలనూ పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని చెప్పారు. డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఉద్యమాలు చేపడతామని తెలిపారు.



స్కూల్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ మనీషా

# విపత్తులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

**నర్సంపేట రూరల్ :** విద్యార్థులకు ప్రకృతి, మానవ నిర్మిత విపత్తులపై అవగాహన అవసరమని జిల్లా ఫైర్ ఆఫీసర్ భగవాన్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ విజయవాడ బృందం సోమవారం నిర్వహించిన కమ్యూనిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుకు వచ్చిన వ్యక్తులకు సీపీఆర్ చేసే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకుంటే ఆపదకాలంలో ప్రాణాలు కాపాడవచ్చని, విపత్తులను నివారించవచ్చని తెలిపారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ తోపాటు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

**రాయపర్తి :** మండలంలోని కొత్తూరులోని ప్రభుత్వ హైస్కూల్‌లో నేడు (మంగళవారం) మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందికట్ల సంతోశ్ తెలిపారు. ఈ మేరకు హెల్త్‌క్యాంపునకు సంబంధించిన ఫ్లెక్సీని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వైద్యశిబిరానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. తదనంతరం సంతోశ్ మాట్లాడారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, పల్మనాలజీ, కార్డియాలజీ స్పెషలిస్టులు పాల్గొని వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో ఉచిత పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హెల్త్‌క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు. పేదలు హెల్త్‌క్యాంపును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రావు, కందికట్ల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

# సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**చెన్నారావుపేట :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీకి ఆమోదం తెలిపిన క్రమంలో మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని రైతు పక్షపాతిగా అభివర్ణించారు. కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూటి పావని, నాయకులు వీరన్న, బోనగిరి సారయ్య, బాదావత్ వీరూ, ముత్యం భద్రయ్య, అశోక్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.